

# బురుజువీధి కథలు

– కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# 14.కొత్త స్వామిజి

**కార్తీకమాసం** వచ్చిందంటే మా బురుజువీధిలో హడావుడి పెరుగుతుంది. మా వీధిచివరున్న మార్కండేశ్వరాలయంలో దాదాపు రోజంతా పూజలు జరుగుతూవుంటాయి, గంటలు మోగుతూనే ఉంటాయి. నెలంతా నదివొడ్డున మెట్లమీద దీపాలు వెలిగిస్తూనే ఉంటారు. ఇక నదీ స్నానాలసంగతి చెప్పనఖ్ఖర్లేదు. ఎన్ని నిబంధనలు పెట్టినా ఒడ్డంతా శుభ్రం చేసుకోవడానికి మార్గశిరమాసంలో మాకు వారంరోజులు పడుతుంది.

"శాస్త్రానికి కొన్ని దీపాలు చాలుగదా. యెవరికి వాళ్లు అడ్డదిడ్డంగా పెట్టకుండా వంతులవారీగా ఒక పద్ధతిగా పెడితే అందంగా వుంటుందిగదా" అంటుంది మా ఆవిడ కామేశ్వరి.

"రోజూ అందరికీ పుణ్యం రావాలి గదా" అంటాన్నేను నవ్వుతూ.

"పేద దేశంలో ఎంత నూనె వృధా అవుతోంది, ఆవరణంతా పాడుచేస్తున్నారు! సంప్రదాయాల వల్ల లాభపడే మన వీధి సంక్షేమసంఘ పెద్దలు యివన్నీ చూసిచూడనట్టుంటారు" అంటాడు మా ఎదురింటి చలపతి.

ఆ నెలంతా ఊర్లోని మిగతా ప్రాంతాలనుంచి కూడా జనం మా వీధికి రోజూ పూజలకోసం, స్నానాల కోసం వస్తారు. మావీధి చివర అప్పుడెప్పుడో జమీందారుగారు నదిలోకి దిగడానికి చక్కగా మెట్లు కట్టించారు. గట్టున పెద్ద రావి, మర్రి, వేపచెట్లూ వాటి చుట్టూ అరుగులుంటాయి కాబట్టి మావీధికి తాకిడి ఎక్కువ. ఐతే అలాంటప్పుడుకూడా ఎవరికిపడితే వారికి మావీధిలోకి ప్రవేశముండదు. అంతో ఇంతో స్థితిమంతులు, ఉద్యోగులు, ముఖ్యంగా మా వీధి సంక్షేమసంఘ పెద్దల దృష్టిలో 'మంచివాళ్లు'గా గుర్తించబడినవాళ్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. మిగిలినవాళ్లు పక్కవీధులగుండా నదికెళ్తారు.

ఎప్పటిలాగే ఆ సంవత్సరం కూడా కార్తీకమాసం చలిగా, ఆహ్లాదకరంగా ప్రవేశించింది.

దసరా, దీపావళి పండగలకే ఇళ్లకు వచ్చేసిన హంగులు, రంగులతో వీధి కొత్తగా తయారైంది. వర్షాలు ముగిసి చెట్లు కొత్తజీవంతో తొణకిసలాడుతున్నాయి. తెల్లమబ్బులు ఆకాశంలో విహారాలు చేస్తున్నాయి. వెన్నెల రాత్రిళ్లు శోభాయమానంగా ఉన్నాయి. రోజూ చీకటిపడేసరికి ఇళ్లముందు ప్రహరీ గోడలమీద, కిటికీల్లో ప్రమిదల్లో నూనెదీపాలు పెడుతున్నారు. వీధంతా శుభ్రం చేయించుకుని సంక్రాంతికి రిహార్సల్ గా పొద్దున్నే ముగ్గులు వేస్తున్నారు. ఇరుగుపొరుగు కుటుంబసభ్యులు స్నేహబృందాలు పొద్దునా సాయంకాలం గుడికి, నదివొడ్డుకెళ్లడం, యిళ్లలో కలవడం పెరిగాయి. ఇక పిల్లల సందడికి అంతే లేదు.

గుళ్లో పూజలను మా సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాయుడుగారు, నదీ స్నానాలను, దీపాలంకరణను ఊరిపెద్దలు, అధికారులు లాంచనంగా ప్రారంభించారు. మా సంఘ పెద్దలు తీరిక దొరికినప్పుడంతా గుళ్లో, నదివొడ్డునా

తిరుగుతూ జనాన్ని కట్టడి చేస్తున్నారు. విఐపీలను ప్రత్యేకంగా ఆదరిస్తున్నారు. 'అందరికీ చెందిన నదిమీద వీళ్ల పెత్తనమేమిటి' అని కొంతమంది యువకులు గొణుగుతున్నారుగాని ఎప్పటిలాగే అడిగే ధైర్యం చెయ్యడంలేదు. మావీధి పరోపకారి పాండురంగ, అతని భార్య సుశీలకు తీరిక దొరకడంలేదు. 'వార్తల వనజమ్మ' మోయలేనన్ని వార్తలను సరఫరా చేస్తోంది.

కామేశ్వరి, ఆమె సన్నిహితులు కొన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు, కొన్నిటినుంచి తప్పించుకుంటున్నారు.

"సంప్రదాయాల్లో యితరులకు నష్టం కలిగించని యీస్థటిక్స్ నాకిష్టం. ఈ విగ్రహాలు, దీపాలు, పువ్వులతో అలంకరణలు, ముగ్గులు, హారతి యివ్వడం అందంగా వుంటాయి. సాంబ్రాణి, అగరొత్తుల వాసన బావుంటాయి. గంటలు, మంత్రాల్లోని సంగీతం వినసొంపుగా వుంటుంది. భక్తులు ప్రపంచాన్ని కాస్సేపు మరచిపోవడానికి వొక అలౌకిక వాతావరణంకోసం యివన్నీ కావాలనే యేర్పరచివుంటారు. ఐతే అందులో తారతమ్యాల్లేకుండా అందరూ వుండాలి. అసలు సంస్కృతి అంటే అదే" అంటుంది.

కామేశ్వరికి అసలు భక్తివుందా లేక యీస్తటిక్స్ కోసం సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొంటుందా అని నాకేప్పుడూ సందేహం. ఎన్నిసార్లడిగినా సమాధానం చెప్పకుండా నవ్వేస్తుంది.

"రానురాను అసలు ప్రయోజనాలు, యీస్థటిక్స్ పోయి ఆచారాలు మాత్రం మిగిలాయి" అంది కామేశ్వరి ఓరోజు గుడినుంచి తిరిగొస్తూంటే.

"కాలక్రమంలో అవన్నీ చిక్కుగా పెనవేసుకుపోయి కొంతమందికి అనుకూలంగా మారిపోయాయి. యెప్పుడో ఎవరో వచ్చి విడదీయాలి" అని జవాబిచ్చాను.

కార్తీకమాసం ప్రారంభమైన నాలుగోరోజు సాయంత్రం బంగార్రాజు ఇంట్లో మావీధి సంక్షేమసంఘం సమావేశం ఉందని హఠాత్తుగా కబురొచ్చింది. 'కార్తీకమాసం రాకముందే మావాళ్లు మీటింగు ఏర్పాటు చేసి అన్నీ నిర్ణయించారు, మళ్లీ ఇదేమిటా' అనుకుంటూ వెళ్లాను.

నేవెళ్లేసరికి అందరూ వచ్చారు. పళ్లముక్కలు తిని, బాదంపాలు తాగాక సమావేశం మొదలైంది. ఉపాధ్యక్షుడు సూచన మీదట బంగార్రాజే ప్రారంభించాడు.

"ఆమధ్య ముంబైలో మా ఆటోమొబైల్ కంపెనీవాళ్ల వ్యక్తిత్వ వికాస ప్రోగ్రాంలో మా అబ్బాయి నవీన్ రాజు పాల్గొన్నాడు. చివరి రెండురోజులూ అభావానంద అనే యువ స్వామీజి మన సంస్కృతి గురించి చాలా గొప్పగా చెప్పాడట" అని ఆగాడు.

"అతన్ని గురించి నేనూ విన్నాను" అన్నాడు స్వామినాయుడు.

"ఆ స్వామిజి టొరొన్టోని యూనివర్సిటిలో వారంరోజులు ఉపన్యాసాలివ్వడానికి వస్తున్నాట్ట. మా అబ్బాయి చెప్పాడు" కొనసాగించాడు బంగార్రాజు.

"అతనిచేత పదిరోజులపాటు మన గుళ్లో ప్రవచనాలిప్పిస్తే యెలావుంటుంది అంటున్నాడు బంగార్రాజు" అన్నాడు మూర్తి.

"మంచిదే, పున్నమి తరువాత పెడితే విఐపీలు మళ్లీ వస్తారు, మనవీధి ప్రతిష్టకూడా పెరుగుతుంది" మద్దతిచ్చాడు ధనరాజు.

“అంత చిన్నవాడికి మన శాస్త్రాలన్నీ తెలిసుంటాయా?” సందేహించాడు కాశీనాథ్.

"అతను మరీ చిన్నవాడు కాదు. యెమ్మెస్సీ బయాలజిలో గోల్డు మెడలిస్టు. తరువాత కాశీకివెళ్లి పదిహేనేళ్లు శాస్త్రాలు నేర్చుకున్నాడట. మా అబ్బాయి చెప్పాడు" అన్నాడు బంగార్రాజు కొంచెం అసహనంగా.

మిగతా సభ్యులంతా బంగార్రాజు సూచనను బలపరిచారు. అతనింట్లోనే పైన పెంట్ హౌస్ లో కొత్తస్వామిజికి బస ఏర్పాటు చేస్తానన్నాడు బంగార్రాజు. పున్నమి తరువాతి రోజునుంచి పదిరోజులపాటు కార్యక్రమం ఉండాలని నిశ్చయించారు. స్వామిజితో మాట్లాడ్డానికి ఇద్దరు సభ్యులను, నవీన్ రాజును పంపించాలని నిర్ణయించారు.

సమావేశం ముగిసి బయటకు వచ్చాక "యిదంతా చూస్తే బంగార్రాజు తన కొడుకు బలవంతం మీద యిదంతా చేస్తున్నట్టుంది" అన్నాను చలపతితో.

"యీ అభావానంద అనే కొత్త స్వామిజికి నవీన్ రాజు అతని మిత్రులు అభిమానులయ్యారట. ఆన్ లైన్లో అతను వీళ్లకి యోగా, ధ్యానం నేర్పిస్తున్నాడు. అతన్నెలాగైనా యిక్కడికి రప్పించాలని నవీన్ రాజు పట్టుదల. బంగార్రాజు కొడుకును కాదనలేడు" అన్నాడు చలపతి.

ఇంటికి రాగానే కామేశ్వరికి కొత్తస్వామిజి ప్రోగ్రాం గురించి చెప్పాను.

"ఆవిషయం మాకూ తెలిసింది. నవీన్ రాజు వూళ్లో తమ పరపతి పెంచుకోవాలనుకున్నాడు. బంగార్రాజింట్లో రెండ్రోజులు తర్జనభర్జనలు జరిగాయి. ఐతే యీ స్వామిజిని మీవాళ్లు పదిరోజులు భరించడం కష్టమనే అనుకుంటున్నాం" అంది కళ్లెగరేసి.

"నీకన్నీ అనుమానాలే. మా పెద్దలకి స్వామిజిలన్నా, ప్రవచనకారులన్నా మహా గౌరవం" అన్నాను.

"మామూలువాళ్లైతే అన్నీ మీ పెద్దలకి వత్తాసుగా చెప్తారు. యీ కొత్త యువస్వాముల ధోరణి వేరేనట. ఆ పేచీకోసం మేమూ సరదాగా యెదురుచూస్తున్నాం" అంది కవ్వింపుగా నవ్వి.

"మీ అనధికార మహిళాసంఘం యెన్ననుకున్నా మా వాళ్లదే గెలుపు" అన్నా నేను సంభాషణ ముగిస్తూ.

పున్నమి వెళ్లిన పాడ్యమిరోజు మధ్యాహ్నానికే గుళ్లో వున్న అనుభవమంటపాన్ని అలంకరించారు. దాని ఎదురుగా ఉన్న నడవంతా కుర్చీలు వేసారు. రోజూ సాయంత్రం ఆరునుంచి ఎనిమిదివరకు ప్రవచనాలుంటాయని కరపత్రాలు ముద్రించి ఊర్లో ముఖ్యులకు అందజేసారు. వచ్చినవాళ్లకి పంచడానికి రుచికరమైన ప్రసాదాలు సిద్ధమయ్యాయి. నవీన్ రాజు బృందం అన్ని ఏర్పాట్లూ దగ్గరుండి చూసుకున్నారు.

కొత్తస్వామిజి నాలుక్కంతా వచ్చేసి బంగార్రాజింట్లో దిగాడు. మా సంక్షేమసంఘం అధ్యక్షుడు రాయుడుగారింట్లో ఐదున్నరకే స్వామిజికి ఉపాహారం ఏర్పాటు చేసారు. ఆరుగంటలయ్యేసరికి మా సంక్షేమ సంఘ సభ్యులు, ఊర్లోని ప్రముఖులు స్వయంగా అభావానంద స్వామిని తీసుకుని మంటపానికొచ్చారు.

స్వామిజి కాషాయవస్త్రాలకు బదులు తెల్లని లాల్చి, పైజామ వేసుకున్నాడు. పెద్దగా పెరిగిన నల్లటి జుట్టు వెనక్కి దువ్వుకున్నాడు. ట్రిమ్ చేయబడిన నల్లటి గడ్డం మెరుస్తోంది. చిన్న గంధపు బొట్టు మాత్రమే పెట్టుకున్నాడు. సన్నగా, పాత జానపద సినిమాలో యువసన్యాసి వేషంలోవున్న ఎన్టీరామారావులా ఉన్నాడు. రాగానే మండపంలో తనకోసం వేసివున్న వెండిరంగు సింహాసనాన్ని తీయించేసి మామూలు కుర్చీ వేయించాడు.

సమావేశాన్ని లాంచనంగా రాయుడుగారు ప్రారంభించారు. కొంతమంది సభ్యులు, ఊరి ప్రముఖులు మాట్లాడాక స్వామిజిని నవీన్ రాజు సభకు పరిచయం చేసాడు. కుర్చీలన్నీ నిండిపోయాయి. అప్పటికే ఏడున్నరవడంతో స్వామిజి గంటసేపు మన ప్రాచీన ధర్మాన్ని, సంస్కృతిని అదేకాలంలోని ఆసియా, ఐరోపాల సంస్కృతితో పోల్చి మెచ్చుకుంటూ ఉపన్యసించి ముగించాడు.

ఆరోజు సభ తామనుకున్నట్టే చక్కగా జరగడంతో మా సంఘ పెద్దలు చాలా సంతోషించారు. బంగార్రాజుని, నవీన్ రాజుని అభినందించారు.

"చూసావా, సాధారణంగా మా వాళ్ల అంచనా తప్పదు" అన్నాను కామేశ్వరితో ఇంటికెళ్లేప్పుడు.

"యింకా మొదటిరోజేగా. ముందుంది ముసళ్ల పండగ" అంది నవ్వుతూ.

మరుసటిరోజు సరిగ్గా ఆరుగంటలకే ప్రారంభమైన ఉపన్యాసం మొదటి గంట బాగానే నడిచింది. స్వామిజి వేదాలు, ఆకాలపు జీవనాన్నిగురించి వివరించాడు. మనం దాన్నుంచి ఎంతో నేర్చుకోవాలన్నాడు. ఆ తరువాత స్వామిజి ధోరణి మారింది. అందరూ అనుకున్నట్టుగా వేదాలలో నిక్షిప్తమైన గూడార్థాలేవీ లేవని, తొలినాటి వేదసాహిత్యం అప్పటి జీవన విధానాన్ని చిత్రించిన విశ్వలయతో కూడిన గొప్ప కవిత్వమని, అదొక అమాయకత్వపు అద్భుతమైన ప్రాకృతిక సమాజమని చెప్పుకుంటూ పోయాడు. తరువాత వచ్చిన వేదాలలో పరిణామం చెందిన ఒక ఉత్తమ జీవితం దానికి కావలసిన శాస్త్రవిజ్ఞానం ఉందని చెప్పాడు. వాటిల్లో గొప్ప వైద్యశోధన, లలిత కళలు, వ్యయసాయం, ఆకాలానికి పనికివచ్చే సాంకేతిక పరిజ్ఞానం ఇలాంటివి ఉన్నాయని, అనవసరమైన మంత్రతంత్రాలు, మూఢనియమాలు తరువాత

వాటిలో చేరి గుర్తుపట్టలేనంతా కలసిపోయాయని వివరించి ఆరోజుకు ముగించాడు. అతను అన్నిటికీ ఉదాహరణలుగా శ్లోకాలు పాడి వినిపించాడు.

మా సంఘ పెద్దలు ఉపన్యాసంలోని రెండో సగం వింటున్నప్పుడు అసహనంగా కదలడం గమనించాను.

స్వామీజి ఉపన్యాసాలు విభిన్నంగా, గొప్పగా ఉన్నాయని రెండోరోజునుంచే చాపకింద నీరులాగా ప్రచారమైంది. మూడోరోజున ప్రేక్షకులు ముఖ్యంగా యువతీయువకులు పెద్దసంఖ్యలో వచ్చారు. గుడి ఆవరణంతా ముందే నిండిపోయి పెద్దవాళ్లకే కుర్చీలు దొరకడం కష్టమైంది.

ఆరోజు స్వామిజి శివతత్వం, బుద్ధుడు, మహావీరుడు, చార్వాకుల గురించి చెప్పి మనమొక విశాలమైన శాస్త్రీయ దృష్టి అలవరచుకోవాలని ఉద్బోధించాడు. రామాయణ మహాభారతాలను గొప్ప ప్రపంచంలోనే కావ్యాలుగా వర్ణించి, స్వార్థానికి పూజలు చేయడం కాకుండా వాటిలోని ధర్మచింతనను ఇప్పటి సమాజానికి వర్తింపచేసుకుని అలవర్చుకోవాలని సూచించాడు. ఇంకా మనుషుల్లో హెచ్చుతగ్గులు లేవని, స్త్రీపురుషులు సమానమని, పరపతి, వేషం కాకుండా ఆచరణను, ప్రవర్తనను బట్టే నిజమైన గురువులని, పెద్దలని గుర్తించి గౌరవించాలని చెప్పాడు.

యువతీయువకులు ప్రతిసారి చప్పట్లతో తమ సంఘీభావాన్ని ప్రకటించారు. చివరన మా వీధి రిటైర్డ్ హింది పండితుడు కాశీనాథ్ స్టేజి ఎక్కి స్వామిజిని ప్రత్యేకంగా అభినందించాడు. మా పెద్దలు అతన్ని ఎర్రగా చూసారు.

ఆరోజు మా సంఘ పెద్దల్లో అసహనం ప్రస్ఫుటంగా కనపడింది. కార్యక్రమం అయిపోయాక నవీన్ రాజు బృందం ఉత్సాహంగా వాళ్లదగ్గరికి వెళ్లి గుడి ఆవరణ సరిపోదని, ఉగాదికి వేయించినట్టు గుడిబయట పెద్ద షామియాన వేద్దామని అన్నారు. మా పెద్దలు మొహాలు గంటుపెట్టుకుని నదీస్నానాలకు వచ్చేవాళ్లకి ఇబ్బందౌతుందని వద్దన్నారు. ఐనా మావీధి యువకులు పట్టు విడవలేదు.

బంగార్రాజు మొహంలో కలవరం కనిపించింది.

అనుకున్నట్టే మూడోరోజు వీధిలో షామియానకింద స్టేజి వేసి ఉపన్యాసం పెట్టారు. ఆరోజు ఇంకా ఎక్కువ జనం వచ్చారు. మావీధి పెద్దలు బలవంతంగా వచ్చినట్టు వచ్చి కూర్చున్నారు. ఇలాంటి ఉపన్యాసాలకెప్పుడూ రాని మావీధి సంస్కృత పండితుడు విశ్వమూర్తి మూడోరోజు వచ్చికూర్చోవడం నాకాశ్చర్యమైంది. తర్వాత తెలిసిందేమిటంటే ఆరోజు పొద్దున్నే మా వీధి పెద్దలు ఆయనింటికెళ్లి ఈ స్వామిజి చెప్పేవి సరైనవా కాదా అన్నది తేల్చి చెప్పాలని ఆయన్ని బలవంతంగా తీసుకొచ్చారని, అంతా విన్న తరువాత ఆయన ఉపన్యాసంలో తప్పులేవీ లేవని చెప్పాడని.

మూడోరోజున స్వామిజి షడ్దర్శనాలు ఉపనిషత్తుల గురించి వివరించి వాటిద్వారా కనీసం మూడువేల యేళ్ల తరువాత రావలసిన తాత్విక విజ్ఞానమంతా ఆకాలానికే వచ్చిందని, మానవ వికాస పరిణామంలో అదొక దీర్ఘమైన

ముందడుగు అని చెప్పాడు. ఆందులోని బహుళత్వమే మన ప్రాచీనతత్వశాస్త్ర సారమన్నాడు. ఐతే అందులో మూఢాచారాలు చేరడంవల్ల అది మసకబారిందన్నాడు.

అసలు ఏమతంలోనూ లేని ఇహము, పరము అనే మౌలిక తాత్విక విభజన మన తత్వంలో ఉందన్నాడు. పరానికి ఇహానికి సంబంధం లేదని, ఇహపరమైన దైనందిన సమస్యలను పూజలతో కాకుండా ధర్మాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలన్నాడు.

దైవచింతన, యోగా, ధ్యానం ఇలాంటివన్నీ పరాన్ని సాధించేందుకే కాని పరం అంటే స్వర్గం నరకం కాదు అది ఇక్కడే ఒక ప్రశాంత విశ్వమానసిక స్థితి అని చెప్పాడు. దీన్ని సాధించగలిగితే ఇక ఇహంలో సమస్యలతో బాధించబడకుండా సుఖజీవనం చేయవచ్చన్నాడు.

స్వామిజి అంతటితో ఆగలేదు. ఇహాన్ని పరాన్ని కలిపేసి కొంతమంది పెద్దలు తమ ఆర్థిక స్వప్రయోజనాలను, స్వంత ప్రాభవాన్ని నిలుపుకోవడానికి తారతమ్యాలు సృష్టించి ప్రజల్ని మూఢత్వంలో పడవేసి ఉంచుతున్నారని, ఇలాంటివి మన మతం విలువను తగ్గిస్తున్నాయని, వాటికి లొంగకూడదని ఉపదేశించాడు. పురాతన ధర్మం ఏదైనా యదాతథంగా ప్రస్తుతకాలానికి పనికిరాదని, తత్వంలోని నిజాన్ని తెలుసుకుని ప్రస్తుతానికి అన్వయించుకుని మంచి జీవితాన్ని గడపాలని చెప్పాడు. సభంతా చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

కాశీనాథ్ లేచి నిలబడి అదే పనిగా చప్పట్లు కొట్టాడు.

నేను మా పెద్దలనే గమనిస్తున్నాను. వాళ్ల మొహాల్లో కళ తప్పింది.

“యితనెవరో సగం ఆస్తిక సగం నాస్తిక స్వామిలాగున్నాడు" అన్నాను నేను యింటికెళ్తున్నప్పుడు చలపతితో.

“యితను చెప్పేదంతా సమంజసంగానే వుంది. యిలాంటివాళ్లు యిప్పుడు చాలా అవసరం" అన్నాడు చలపతి.

నేనింటి దగ్గరికి రాగానే అప్పుడే కామేశ్వరి సభనుంచి వచ్చి తాళం తీస్తోంది.

"నేను చెప్పలేదా యితను మరోరకం స్వామిజి అని, మీవాళ్లకు బాగా బుద్ధిచెప్తున్నాడు. మింగలేక కక్కలేక తలకిందులౌతున్నారు" అంది నవ్వుతూ.

“మా వాళ్లను తక్కువ అంచనా వేస్తున్నావు. చూస్తూండు అంతిమ విజయం వాళ్లదే" అన్నాను.

"అదీ చూద్దాం" అని " నీకింకా తెలిసినట్టు లేదు, యివాళరాత్రి రాయుడిగారింట్లో మీ సంఘ పెద్దలు 'యితన్నెలా వదిలించుకోవాలా ' అని రహస్యంగా సమాలోచన చేయబోతున్నారంట. నిన్ను పిలవకపోవచ్చనుకో" అంది వంటింట్లోకి వెళ్తూ కొంటెగా.

నాలుగోరోజు పొద్దున స్వామిజి ఉపన్యాసాలను అద్భుతమని పొగుడుతూ లోకల్ దినపత్రికల్లో వార్తలొచ్చాయి. మా వీధి సంక్షేమ సంఘం యింకా విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారని ఊర్లోవాళ్లంతా ఆహ్వానితులేనని

కూడా రాసారు. మధ్యాహ్నానికంతా ఊరంతా కరపత్రాలను పంచిపెట్టారు. సాయంత్రం ఐదయ్యేసరికి షామియానాలు కొత్తగా వేసి ప్రేక్షకులు కూర్చునే స్థలాన్ని రెండింతలు పెంచి దాదాపు వీధి సగంవరకు తెచ్చారు.

"చూసావా నువ్వు మావాళ్లని తప్పుగా అర్థం చేసుకున్నావు" అన్నాను.

"యిదేదో యెత్తుగా వుంది. రేపటిగ్గాని దీని సంగతి బయటపడదు" అంది కామేశ్వరి అనుమానంగా. తనెప్పుడూ అంతే, ఓటమిని ఒప్పుకోదు.

నాలుగోరోజు సాయంత్రం జనం తండోపతండాలుగా వచ్చారు. షామియాన ఐదున్నరకే నిండిపోయింది. ఆరుకంతా జనం వీధంతా నిండిపోయి షామియాన కింద ఎక్కడ వీలయితే అక్కడ ఇరుక్కుని క్రిక్కిరిసిపోయారు. స్వామిజి ఆరోజు భారతీయ ధర్మంగురించి చెప్పడం మొదలెట్టాడు. ఉపన్యాసం ప్రారంభమైన అరగంట బాగానే గడిచింది.

ఆతరువాత స్వామిజి ఉపన్యాసం మైకులో బాగానే వినపడుతున్నా ఆయన కనిపించక షామియాన చివరి వరసల్లోని జనం వాళ్లలో వాళ్లు మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

ఈమధ్యలో పిల్లల గొడవ, ఏడుపులు, మనుషులు లేచి తిరగడం మొదలయ్యాయి. కొంతమంది వాలంటీర్లు పిల్లలకి మిఠాయిలు పంచడం ప్రారంభించారు. ఇంకా గందరగోళంగా తయారైంది. ఇంతలో కొంతమంది మనుషులు ఆనవాయితిగా గుడికి తీసుకెళ్లడానికి ఒకపక్కనుంచి ఎద్దులను తీసుకొచ్చారు. దాంతో జనం కంగారుపడి మరోవైపుకు వెళ్లడం మొదలుపెట్టారు. కుర్చీలు పడిపోయాయి. కొన్నిచోట్ల షామియాన కర్రలు పడిపోయాయి. అంతా అదుపుతప్పి పోయింది. ఉపన్యాసం ఆగిపోయింది. మా సంఘ పెద్దలు స్టేజి ఎక్కి అందర్నీ నిశ్శబ్దంగా ఉండమని అంతా సర్దుకుంటుందని మైకులో చెప్పారు. నవీన్ రాజు మిత్రబృందం ఎద్దులను గుడిలోకి పంపించివేసి సభను నియంత్రణలోకి తీసుకొచ్చారు.

అయితే అదంతా జరగడానికి అరగంట పట్టింది. ఆవులు, ఎద్దులు తిరిగొచ్చేపుడు ఎలావుంటుందో అని భయపడి కొంతమంది ఆహ్వానితులు పిల్లలను, వృద్ధులను తీసుకుని వెళ్లిపోయారు. మొత్తంమీద మళ్లీ సభ ప్రారంభమై కడదాకా అటూఇటూగా జరిగింది. సరిగ్గా విన్నామన్న తృప్తి ఎవరికీ కలగలేదు. చివరన మా సంఘ సెక్రటరి మునిరెడ్డి క్షమాపణలు చెప్పాడు.

ఆ మరుసటిరోజు పొద్దున్నే ప్రాంతీయ పత్రికలు సభలో జరిగిన గందరగోళాన్ని ప్రస్తావించి, అంతమంది ప్రజలు వస్తున్న అలాంటి విలువైన ఉపన్యాసాలు అలా వీధిలో షామియాన వేసి జరపడం సబబుకాదని, ఊరికి అటుచివర కళాశాల మైదానానికి మార్చాలని గట్టిగా రాసాయి.

ఓగంట తరువాత బంగార్రాజింట్లోనే వీధి సంక్షేమసంఘ సమావేశం జరిగింది. ముందురోజు ఏప్రమాదం జరగకపోవడం అదృష్టమని, ఇక వీధిలో ఉపన్యాసాలను కొనసాగించడం ఏమాత్రం మంచిదికాదని, పత్రికల్లో

రాసినట్టుగా వాటిని మార్చాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. నాకు, చలపతికి మాట్లాడే అవకాశం రాలేదు. నవీన్ రాజు , అతని మిత్రులు ఈ ప్రతిపాదకు ఒప్పుకోక తప్పలేదు.

మధ్యాహ్నానికంతా సభాస్థలం ఊరిచివరి కళాశాల మైదానానికి మార్చినట్టు కరపత్రాలు ఊరంతా పంచబడ్డాయి. మా వీధి మొదట్లో బురుజువైపు, కచేరి సత్రంవైపు ఈ మార్పు తెలియజేస్తూ రెండు తాత్కాలికి బోర్డులుకూడా వెలిసాయి.

ఇంత జరిగాక మావీధిలోవాళ్లకు ఆసక్తి పోయి సభలకు వెళ్లడం మానేసారు. ఆతరువాత అక్కడ ఉపన్యాసాలు బాగానే జరిగినా వేదిక చాలా దూరంకాబట్టి ఊళ్లోవాళ్లు కూడా పెద్దసంఖ్యలో హాజరుకాలేదని తెలిసింది.

మా కార్తీక మాస ప్రవచన కార్యక్రమం ఆ సంవత్సరం అలా ముగిసింది. ఆ తరువాత మా పెద్దలు అలాంటివాళ్ల ఉపన్యాసాలు మళ్లీ పెట్టలేదు.

“మీవాళ్లెంత తెలివిగా స్వామిజిని వదిలించుకున్నారో చూసావా. నేను ముందే చెప్పలేదా?” అంది కామేశ్వరి కొత్త స్వామిజి ఉపన్యాసాలను దూరంగా మార్చాక.

“ఐతే అలా వూరంతా పబ్లిసిటి యిచ్చి, పెద్దయెత్తున జనం వచ్చేట్టు చేయడం, సభలో గందరగోళం సహజంగా జరిగినట్టు సృష్టించడం యివన్నీ మా పెద్దలే చేసారంటావా?” అనడిగాను

“యింకా సందేహమా? యెవరైనా ప్రజల కళ్లు తెరిపించడానికి వచ్చినా వాళ్లనెలా తప్పించాలో మీ పెద్దల్లాంటివాళ్లకి బాగా తెలుసు. చూసావుగా" అంది కామేశ్వరి నవ్వుతూ.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments